క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.83, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 50, పచ్చిమిర్చి 75, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 80, పచ్చికాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 16, క్యారెట్ 45, దొండ 18, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 15, దోసకాయ 21, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 43, మొరంగడ్డ 18, కందగడ్డ 28, సొరకాయ 17, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

హుండీల ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలోని హుండీలను బుధవారం అధికారులు లెక్కించారు. 25 రోజులు హుండీల ద్వారా రూ.36,46,612 ఆదాయం వచ్చిందని ఈఓ ఎస్.అన్నపూర్ణ తెలిపారు.

ఘనం.. గరుడ హోమం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ కోనేరు వీధిలోని పెరుమాళ్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం గరుడ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అత్యంత నియమనిష్టలతో గరుడ హోమాన్ని చేపట్టారు.

హెల్త్ సెంటర్ మూసివేతపై ఆగ్రహం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌ను మూసివేయడం పట్ల విద్యార్థులు, ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాల కారణంగా ఓయూ కాలేజీలకు రెండు రోజులు సెలవులు ప్రకటించిన విషయం విదితమే. కానీ హెల్త్ సెంటర్‌ను ఉదయం కేవలం 2 గంటలు తెరిచి ఆ తర్వాత మూసివేయడంతో రోగులు ఇబ్బందులు పడుతూ వెనుతిరుగుతున్నారు. ఓయూ అధికారులు చొరవ తీసుకొని హెల్త్ సెంటర్‌ను తెరిపించాలని కోరారు.

పనుల పరిశీలన

అడ్డగుట్ట: డివిజన్‌లోని సీ,డీ సెక్షన్లలో జరుగుతున్న కమ్యూనిటీహాలు నిర్మాణ పనులను బుధవారం బీఆర్ఎస్ నేతలతో కలిసి జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా డివిజన్‌లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. ప్రజా అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటికి అనుగుణంగా పనులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ పద్మలత, ఏఈ వేణు, బీఆర్ఎస్ నేతలు వడ్లూరి రవి, గోపి, రాజు పాల్గొన్నారు.

సకాలంలో సమస్యలకు పరిష్కారం

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు గట్టి చర్యలు
- సికింద్రాబాద్ నూతన ఆర్డీఓ టి. రవితో 'సాక్షి' ముఖాముఖి





బన్సీలాల్‌పేట్: పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందించడానికి గట్టి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల పరిరక్షణకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతూ కోర్టుల్లో న్యాయ పోరాటం చేస్తూ కోట్లాది రూపాయల విలువైన భూములను స్వాధీనం చేసుకుంటున్నామని సికింద్రాబాద్ నూతన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన టి. రవి పేర్కొన్నారు. నిజామాబాద్ ఆర్డీఓగా పనిచేసిన రవి బదిలీపై సికింద్రాబాద్‌కు వచ్చారు. ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన టి. రవి 'సాక్షి'తో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: ప్రభుత్వ భూముల పరిరక్షణకు తీసుకునే చర్యలు ఏంటి?

ఆర్డీఓ: సికింద్రాబాద్ రెవెన్యూ డివిజనల్ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతాం. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇప్పటికే కబ్జాకు గురైన భూముల విషయంలో న్యాయపోరాటం చేసి వాటిని స్వాధీనం చేసుకుంటున్నాం. మండలాల వారీగా ప్రభుత్వ భూములను గుర్తించి అక్కడ బోర్డులను ఏర్పాటు చేస్తాం. కోర్టుల్లో కేసులు వీగిపోకుండా పకడ్బందీ చర్యలతో ముందు వెళ్తాం.

ప్రశ్న: సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ కార్యకలాపాల గురించి..

ఆర్డీఓ: సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో సికింద్రాబాద్, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, అమీర్‌పేట్, షేక్‌పేట్, ఖైరతాబాద్, ముషీరాబాద్ మండలాలు ఉన్నాయి. ఆయా మండల కార్యాలయాల ద్వారా రెవెన్యూ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: చాలా బస్తీల్లో 'డబుల్' ఇళ్ల మంజూరు కాక లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి తీసుకునే చర్యలు ఏంటి?

ఆర్డీఓ: సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అనేక అసెంబ్లీ నియోజకవర్గాల్లోని బస్తీల్లో డబుల్ బెడ్రూమ్‌ల నిర్మాణాలు జరిగాయి. చాలా వరకు లబ్ధిదారులకు అలాట్‌మెంట్ కూడా చేశారు. అక్కడక్కడ కొన్ని సమస్యల కారణంగా అలాట్‌మెంట్ ఇవ్వలేకపోయం. అయితే సరైన పత్రాలు..ఆధారాలతో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది విచారణ చేపట్టి అందజేస్తాం. అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం.

ప్రశ్న: ప్రజా ఫిర్యాదుల స్వీకరణ.. పరిష్కారం గురించి..

ఆర్డీఓ: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తున్నాం. సకాలంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే విధంగా తమ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. సేవల్లో ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రెవెన్యూ సేవల్లో దళారీ వ్యవస్థ నిర్మూలనకు తీసుకునే చర్యలు..

ఆర్డీఓ: రెవెన్యూ పరమైన సేవల్లో దళారీ వ్యవస్థకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలు నేరుగా వచ్చి ఆయా పథకాలు, సేవల కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిష్కారిస్తాం. సేవల్లో జాప్యం లేకుండా ఇప్పటికే ఆయా మండలాల పరిధిలోని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. సేవల్లో నిర్లక్ష్యం ఉన్నా.. జాప్యం జరిగినా వెంటనే ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

శిథిలం.. స్పందించరేం?



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ రోడ్డులోని పురాతనమైన మనోహర్ థియేటర్ ఉంది. ఈ థియేటర్ మూసివేసి దాదాపు పదేళ్లకు పైగా అయింది. కానీ అప్పటి నుంచి మూసి ఉన్న దీని గురించి యజమానులు పట్టించుకోలేదు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలుతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి నెలకొంది. ఈ థియేటర్‌ను ఆనుకుని సులభ్ కాంప్లెక్స్, ఓ దేవాలయం ఉంది. ఈ థియేటర్ చుట్టూ కార్లు, ఆటోలు పార్కింగ్ చేస్తుంటారు. సమీపంలోనే కళాశాలలు, పాఠశాలలు ఉండటంతో దాని పక్కనుంచే విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం మూడుమార్లు తాము నోటీసులు ఇచ్చామని అంటున్నా యజమానులు మాత్రం స్పందించడం లేదు. వెంటనే శిథిలావస్థలోని థియేటర్‌ను కూల్చివేయాలని లేదంటే పెద్ద ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని అందించనున్న నేపథ్యంలో కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం తార్నాకలో ముస్లింలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా పేదరికాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోతె శోభన్‌రెడ్డి, ఖాజా పాషా, ఫయాజ్, యాకూబ్,ఉమర్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో బీజేపీ నేతల పర్యటన



నీట మునిగిన ప్రాంతాల్లో పర్యటిస్తున్న బీజేపీ నేతలు

బౌద్ధనగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. బౌద్ధనగర్‌లోని ఎల్ఎన్‌నగర్, వారాసీగూడ ప్రాంతాల్లో నీటి మునిగిన ప్రాంతాలను బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. చిన్నపాటి వర్షాలకే ఇలాంటి పరిస్థితులు ఉంటే భవిష్యత్ ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నామని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి లోతట్టు, నాలా పరీవాహక ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, శ్రీనివాసరావు, ఓములు, శ్యామ్, సత్యనారాయణ, రవీందర్, బాలకృష్ణ, వనమాల పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

లాలాపేట: భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తార్నాక డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను బుధవారం సికింద్రాబాద్–మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి వెళ్లి పరామర్శించారు. లాలాపేట చంద్రబాబునగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లోని గుడిసె వాసులకు నిత్యావసర సరుకులు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్‌గౌడ్, పోచయ్య, శ్రీనివాస్, శ్రీనివాసచారి,వేణు, మహేశ్, కృష్ణమూర్తి,రామకృష్ణ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



కొవొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: మణిపూర్‌లో క్రైస్తవులు, చర్చిలపై జరుగుతున్న దాడులు, అసాంఘిక చర్యలను ఖండిస్తూ సికింద్రాబాద్ సీఎస్ఐ వెస్లీ చర్చి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. బుధవారం సాయంత్రం క్లాక్‌టవర్ ప్రాంతంలోని చర్చి నుంచి ఎస్డీరోడ్ మీదుగా మదర్ థెరీసా విగ్రహం వరకు క్రైస్తవులు, పాస్టర్లు, సంఘ పెద్దలు సేవ్ మణిపూర్, వీ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా చర్చి ప్రెస్బిటర్ ఇన్‌చార్జి జేమ్స్ సిసిల్ విక్టర్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో గత మూడు నెలలుగా క్రైస్తవులపై దుశ్చర్యలు సాగుతున్నాయని అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.అనేక చర్చిలను తగులబెట్టారని ఇద్దరు స్త్రీలను వివస్త్ర చేసి సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసాంఘిక శక్తులకు అణచివేసి శాంతిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడ మరణించిన వారికి చర్చి వద్ద కొవొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చర్చి ప్రెస్బిటర్ కార్యదర్శి కే ఫ్రాన్సిస్, ప్రాపర్టీ సెక్రటరీ కే సుధీర్ జాన్సన్, కోశాధికారి జాన్ దివాకర్, స్టివార్డ్ మెత్యూషిలా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



జీహెచ్ఎంసీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

లాలాపేట: గత కొన్ని రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రాము వర్మ ఆధ్వర్యంలో తార్నాక నుంచి జీహెచ్ఎంసీ కార్యాలయానికి వెళుతున్న నాయకులు పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు విన్నవించడానికి వెళ్తున్న తమను అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. తార్నాక డివిజన్ పరిధిలోని లాలాపేట, సత్యానగర్, శ్రీపురి కాలనీ, చంద్రాబునగర్, వినోభానగర్ తదితర ప్రాంతాల్లో వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం జీహెచ్ఎంసీ కార్యాలయంలో అసిస్టెంట్ మున్సిపల్ అధికారి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో వేణు, కృష్ణమూర్తి, నవీన్‌మాల, గోవర్ధన్, సతీష్‌రెడ్డి, అజయ్,ఉపేందర్ ఉన్నారు.

చిన్నారి క్రీడాకారిణికి ఆర్థికసాయం

చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్‌కు చెందిన చిన్నారి క్రీడాకారిణి ఆలేటి వంశిక (10)కు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సంఘ సేవకుడు నాగులూరి సాయిబాబా ఆర్థిక సాయం అందజేశారు. సికింద్రాబాద్ సెయింట్ ఆంథోని గర్ల్స్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న వంశిక టగ్ ఆఫ్ వార్ క్రీడలో పలు పతకాలు సాధించింది. వంశిక తండ్రి బాలకృష్ణ డ్రైవర్, తల్లి బాలామణి టైలరింగ్ టీచర్. తమిళనాడు నమక్కల్ జిల్లా తిరుచెంగోడీలో ఇటీవల జరిగిన జాతీయ టగ్ ఆఫ్ వార్ పోటీల్లో తెలంగాణ తరుపున పాల్గొనింది. వర్ధమాన, చిన్నారి క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో వంశిక ఇంటికి వెళ్లిన సాయిబాబా వారి ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని తనవంతుగా ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు తుమ్మశ్రీను, ఆంజనేయులు, సతీష్, రవికిరణ్, ప్రమోద్, రమేష్ పాల్గొన్నారు.



వంశికకు ఆర్థికసాయం అందిస్తున్న సాయిబాబా

'బీఆర్‌బీ కోఆర్డినేటర్ తీరు సరికాదు'

ఉస్మానియా యూనివర్సిటీ: బాల రక్షణ భవన్ (బీఆర్‌బీ) కోఆర్డినేటర్ ప్రియాంక బాల్య వివాహం సంఘటనలో వ్యవహరించిన తీరు సరికాదని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్ ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. మేడ్చల్ జిల్లాలోని ఓ గ్రామంలోని దళితుల కుటుంబానికి చెందిన 15 ఏళ్ల అమ్మాయిని, 35 ఏళ్ల యువకుడితో జరుగుతున్న బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. అనంతరం మీడియాకు చిరునామాతో పాటు అన్ని వివరాలను వెల్లండిచారు. అయితే సెక్షన్ 74 జోనల్ జస్టిస్ యాక్ట్ (జేజే) నిబంధనలను ప్రకారం అత్యాచారాలు. బాల్యవివాహాలు జరిగినప్పుడు మహిళల చిరునామాను గోప్యంగా ఉంచాలి. కానీ బీఆర్‌బీ కోఆర్డినేటర్ ప్రియాంక నిబంధనలు ఉల్లంఘించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో బాధితుల చిరునామాను వెల్లడించడంతో పాటు సోషల్ మీడియా, యూ ట్యూబ్ చానళ్లలో అప్ లోడ్ చేయించగా నేటికి విషయం చక్కర్లు కొడుతుందన్నారు. దీంతో భవిష్యత్‌లో సదరు బాలికను పెళ్లి చేసుకునేందుకు ఎవరు ముందుకురారని పేర్కొన్నారు. మీడియాలో వచ్చిన కథనాలను సుమోటోగా తీసుకొని ప్రియాంక పై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అతిథి అధ్యాపకులను కొనసాగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 1940 అతిథి అధ్యాపకులను కొనసాగించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం కొనసాగుతున్న అతిథి అధ్యాపకుల 2023–24 విద్యా సంవత్సరానికి కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణను కోరారు.

భారీ వర్షం.. రోడ్లు ధ్వంసం



లాలాపేటలో గుంతలమయంగా రోడ్డు



శాంతినగర్ లిల్లీ మోడల్ స్కూల్ వద్ద రోడ్డులోకి కుంగిపోయిన మ్యాన్‌హోల్



శాంతినగర్‌లో రోడ్లపై పారుతున్న నీరు

అడ్డగుట్ట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అడ్డగుట్ట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. అడ్డగుట్టలోని మసీదు వద్ద గుంతలు ఏర్పడి, కంకర పైకి తేలడంతో ఆ మార్గన రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. శాంతినగర్‌లోని లిల్లీ మోడల్ స్కూల్ వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్ భూమిలోకి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. అదే విధంగా అక్కడి బస్తీలో మురుగునీరు పూర్తిగా రోడ్డుపై ప్రవహిస్తుండడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరా నగర్ రైల్వే క్వార్టర్స్ సమీపంలో వారం రోజులుగా చెత్త పేరుకుపోయింది. దీనికి తోడు కురుస్తున్న వర్షాలకు అందులో నుంచి వస్తున్న దుర్గంధంతో బస్తీవాసులు రోగాలబారిన పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజా సమస్యలపై స్పందించాలని కోరుతున్నారు.

తార్నాక డివిజన్ పరిధిలో..

లాలాపేట: గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు, రహదారులపై వర్షం నీరు నిలిచి చిత్తడిగా మారాయి. తార్నాక డివిజన్ పరిధిలోని లాలాపేట ప్రధాన రహదారి నుంచి సత్యానగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డంతా గుంతలమయంగా మారింది. దీంతో ఆ మార్గం గుండా ప్రజలు రాకపోకలు సాగించలేకపోతున్నారు. బస్తీ అంతర్గత రోడ్లలో మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి.



అడ్డగుట్టలో వర్షంధాటికి కంకర తేలిన దృశ్యం



అమరులకు వందనం

రసూల్‌పురా: కార్గిల్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన బొల్లారంకు చెందిన లాన్స్ నాయక్ రాంచందర్ విగ్రహానికి ఆయన కుటుంబ సభ్యులు, కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరశురాం నివాళులర్పించారు. మద్రాస్ రెజిమెంట్ సైనికులు రాంచందర్ విగ్రహం వద్ద కవాతు నిర్వహించారు. వివాహం జరిగిన మూడు నెలలకే కార్గిల్ యుద్ధంలో పాల్గొనాలని పిలుపు రావడంతో బొల్లారం నుంచి బయలుదేరిన రాంచందర్ యుద్ధంలో తమ ప్రాణాలను దేశం కోసం త్యాగం చేశాడని రాంచందర్ తల్లి బాలమణి, సోదరులు రవికిరణ్, మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సాయి ప్రసాద్, ధనుంజయచారీ, శ్రీకాంత్ జైనపల్లి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరేడ్‌మైదానంలో..

సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో వీరుల సైనిక్ స్మారక్ వద్ద 24వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బుధవారం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా హెడ్‌క్వార్టర్స్ జనరల్ ఆఫీస్ కమాండింగ్, మేజర్ జనరల్ రాకేష్ మనోచా హాజరై అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛంతో నివాళి అర్పించారు.



స్థూపం వద్ద పుష్పగుచ్ఛం సమర్పిస్తున్న రాకేష్ మనోచా



రాంచందర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన బోర్డు సీఈవో మధుకర్ నాయక్

రూ.లక్ష ఆర్థిక సాయం క్రైస్తవులకూ వర్తింపచేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని క్రైస్తవులకూ వర్తింపచేయాలని క్రిస్టియన్ మైనార్టీ నాయకులు డాక్టర్ కే.పాల్‌మార్క్ కోరారు. బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి తెలంగాణలో క్రైస్తవులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కారుపై కూలిన చెట్టు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ సెయింట్ ఫ్రాన్సిస్ జూనియర్ కాలేజ్ ప్రాంతంలో వర్షాలకు ఓ భారీ చెట్టు విరిగిపడింది. గత వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో బుధవారం మధ్యాహ్నం సమయంలో ఈ చెట్టు విరిగి అక్కడే ఉన్న కారుపై పడటంతో పాక్షికంగా దెబ్బతింది. వెంటనే జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుని విరిగిపడిన చెట్టును తొలగించారు. అయితే కారు కొమ్మలు విద్యుత్ వైర్లకు తగలడంతో మంటలు చెలరేగాయి. విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకుని సరఫరా నిలిపివేసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.